క్లుప్తంగా

ఫిట్నెస్ చాంపియన్ షిప్ విజేతకు ఘన సన్మానం



విశ్వతేజను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు: ఇటీవల బెంగళూరు ప్రో 2023 ఫిట్నెస్ చాంపియన్‌షిప్ సీనియర్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన పట్టణానికి చెందిన విశ్వతేజను మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. విశ్వతేజ తండ్రి ఆర్‌హెచ్‌ఎం కాశీనాథ్ స్నేహితులు (10 తరగతి బ్యాచ్ 1978) మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్.రామలింగప్ప, మాజీ కౌన్సిలర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో అతడిని శాలువాతో సత్కరించి నెట్టికంటి ఆంజనేయస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. జాతీయస్థాయిలో పోటీల్లో రాణించాలని వారు విశ్వతేజకు సూచించారు.

ఇసుక టిప్పర్ సీజ్

తాడిపత్రి అర్బన్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను శుక్రవారం భోగసముద్రం సర్కిల్ వద్ద సెబ్ పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్ తిరుపాలుపై కేసు నమోదు చేసి టిప్పర్‌ను కేసు నమోదు నిమిత్తం రూరల్ పోలీసులకు అప్పగించినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించండి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కుళ్లాయిస్వామి

పెద్దవడుగూరు: సచివాలయ సిబ్బంది తమ విధులను టూ నిర్వర్తించాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మేడిమాకులపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. కుల గణన ను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఎంఈఓ రాముడు ఉన్నారు.

మట్కాబీటర్ల అరెస్ట్

యల్లనూరు: చింతకాయమంద గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మట్కా రాస్తుండగా శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.10,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు.

ప్రశాంతంగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



బహిరంగ సభ నిర్వహిస్తున్న అధికారులు

పామిడి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన సామాజిక తనిఖీపై ప్రజావేదిక(బహిరంగ సభ) కార్యక్రమం ప్రశాంతంగా సాగింది. అంబుడ్స్‌మన్ మధుసూదన్, డీవీఓ రమణారెడ్డి, వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, గుత్తి క్లస్టర్ ఏపీడీ విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా తనిఖీ బృందం సభ్యులు తనిఖీలో వెల్లడైన అంశాలను వివరించారు. మండలవ్యాప్తంగా 2022–23కు సంబంధించి 18 పంచాయతీల్లో రూ.6 కోట్ల ఉపాధి పనులు జరిగాయని తెలిపారు. ఇందులో రూ.83,334 దుర్వినియోగమైనట్లు తనిఖీ బృందం సభ్యులు తేల్చారు. బాధ్యుల నుంచి సొమ్ము రికవరీ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎంపీడీఓ డీ ప్రభాకర్ నాయక్, ఏపీఓ మల్లీశ్వరి, సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి, బెల్లాల రమణారెడ్డి,రమేష్‌రెడ్డి, ఉపాధిహామీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

రామగిరి: మండలంలోని నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజల్లో ఉమ్మడి జిల్లా వాసులేగాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో ప్రతి ఆది, మంగళ, శుక్ర వారాల్లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: కుటుంబ కలహాలతో లక్ష్మి అనే వివాహిత శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని దాసంపల్లికి చెందిన లక్ష్మి, వడ్డే గంగారాజు దంపతులు తరుచూ ఆర్థిక విషయాల్లో గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో శుక్రవారం మరోసారి గొడపడ్డారు. సహనం కోల్పోయిన లక్ష్మి ఇంట్లో ఉన్న విష రసాయనం తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు ఆమెను అనంతపురం తరలించారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్రా పోటీలు



నియోజకవర్గ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన రాయలచెరువు జట్టు



గుత్తిలో అబ్బేదొడ్డి జట్టుకు కప్ అందిస్తున్న దృశ్యం

యాడికి: మండలంలోని మోడల్ స్కూల్ క్రీడా మైదానంలో శుక్రవారం మండల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. రాయలచెరువు నం: 1 సచివాలయం జట్టు యాడికి నంబర్ సచివాలయం–2పై గెలుపొంది నియోజక వర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ పోటీలోల13 జట్లు పాల్గొన్నాయని పాల్గొన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కాశెప్ప, పీడీలు నాగేంద్రబాబు, ఓబుళమ్మ, చిన్న ఓబులేసు, మహబూబ్‌బాషా, మల్లికార్జున, వీరేష్, లోకేశ్వరి, జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రషీద్ పాల్గొన్నారు.

యల్లనూరు: చిలమకూరు మోడల్ స్కూల్‌లో శుక్రవారం మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు ముగిశాయి. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింట్ విజేతలను ఎంపీడీఓ వీరరాజు, చిలమకూరు, చింతకాయమంద సర్పంచులు పెద్దనాగరాజు, సాయి, ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు, ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి అభినందించారు. పీడీలు ప్రసాద్‌నాయక్, బాలమధుసుధన్ రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో అబ్బేదొడ్డి జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం అబ్బేదొడ్డి, కొత్తపేట జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అబ్బేదొడ్డి జట్టు రెండు సెట్లు గెలిచి విజేతగా నిలిచింది. విజేతలకు ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత లక్ష్మీకాంతరెడ్డి కప్ అందజేశారు. కార్యక్రమంలో పీఈటీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచుదాం

- రూ.84.09 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎన్.భవాని

గుంతకల్లుటౌన్: మున్సిపాల్టీలో రెవెన్యూ ఖర్చులు తగ్గించి మూలధన ఆదాయం పెంచేందుకు కృషి చేద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. పట్టణ ప్రజలు, మున్సిపల్ కౌన్సిల్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సహకారంతో ఆదర్శ మున్సిపాల్టీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ అధ్యక్షతన ప్రత్యేక కౌన్సిల్(బడ్జెట్) సమావేశం జరిగింది. మున్సిపాల్టీలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.84.09 కోట్ల అంచనాతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎస్సీలకు 17.10 శాతం, ఎస్టీలకు 5.33 శాతం, స్త్రీలు, బాలల సంక్షేమానికి 5 శాతం, దివ్యాంగుల సంక్షేమానికి 3 శాతంతో పాటు మురికివాడలు, పట్టణాభివృద్ధికి రూ.40 శాతం ఖర్చుచేయాలని తీర్మానించారు. కౌన్సిలర్లు కృపాకర్, పవన్‌గౌడ్ మాట్లాడుతూ మున్సిపల్ పాతగరల్స్‌హైస్కూల్ స్థలాన్ని లీజుకివ్వడం ద్వారా ఏడాదికి రూ.50 లక్షలు, ప్రస్తుతం ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లపై గదులు నిర్మించడం ద్వారా ఆదాయం సమకూరనుందని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో వార్డుల్లో త్వరగా పనులు చేయించాలని కోరారు. కౌన్సిలర్ మెహరున్నీసా మాట్లాడుతూ తన వార్డులో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించాలని, సచివాలయం ద్వారా ప్రజలకు సేవలు మెరుగుపరచాలని కోరారు. నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తి చేయిస్తామని, సంపద సృష్టించేందుకు ఆదాయ మార్గాలను అన్వేషిస్తామని కమిషనర్ వెల్లడించారు. సమావేశంలో కౌన్సిల్, కోఆప్షన్‌సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన కౌన్సిల్..

సామాజిక న్యాయానికి ప్రతిరూపంగా విజయవాడలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ భారీ విగ్రహం, స్మృతివనాన్ని ఏర్పాటు చేయించిన సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి కౌన్సిల్ తరఫున కృతజ్ఞతలు తెలపాలని కోఆప్షన్‌సభ్యుడు రాజశేఖర్ ప్రతిపాదించారు. దీంతో కౌన్సిల్, అధికారులంతా కరతాళ ధ్వనులతో సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

సమగ్ర కుల గణనకు శ్రీకారం



గుత్తి ఓల్డ్ సీపీఐ కాలనీలో కుల గణన సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది



తాడిపత్రి పోరాటకాలనీలో సర్వేపై ఆరా తీస్తున్న కమిషనర్ రవి

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన కుల గణనకు మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు శ్రీకారం చుట్టారు. శుక్రవారం సమగ్ర కులగణన సర్వేను మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్. భవాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 92 ఏళ్ల తరువాత కుల గణనకు నాంది పలికిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోనున్నారన్నారు. సర్వేకు సిబ్బందికి పురప్రజలంతా సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మాజీ చైర్మన్ రామలింగప్ప, టీపీఎస్ అబ్దుల్ సత్తార్, మెప్మా సీఓ మధు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం కుల గణన సర్వే ప్రారంభమైంది. ఓల్డ్ సీపీఐ కాలనీలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు, వార్డు వలంటీర్లు ఇంటింటికి వెళ్లి కుల గణన చేపట్టారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: సమగ్ర కుల గణన సర్వేను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జి.రవి పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ సచివాలయ కార్యదర్శులకు సూచించారు. సర్వే చేసే క్రమంలో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి ఒక్క కుటుంబం వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గణన సమయంలో అందుబాటులో లేనివారు తమ కుల సమాచారాన్ని ఆయా వార్డు సచివాలయాల్లో జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు నమోదు చేసుకోవచ్చన్నారు. టీపీఓ సతీష్, మేనేజర్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పామిడి: మండలంలో శుక్రవారం కుల గణనకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. ప్రజలు కులగణనను సహకరించాలని ఎంపీడీఓ కోరారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా శుక్రవారం కులగణన సర్వే ప్రారంభమైంది. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు





ప్రమాదంలో గాయపడిన రవి, ఆనంద్

బుక్కరాయసముద్రం: సిద్దరాంపురం రోడ్డు సమీపాన దేవరకొండ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు సిద్దరాంపురం గ్రామానికి చెందిన రవి, ఆనంద్ ద్విచక్ర వాహనంపై బీకేఎస్‌లో సొంత పని ముగించుకుని స్వగ్రామానికి బయలు దేరారు. దేవరకొండ సమీపంలో జగనన్న లేఅవుట్ వద్ద సిద్దరాంపురం నుంచి బీకేఎస్ వైపు వస్తున్న మరో ద్విచక్ర వాహనం వారి వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో రవి, ఆనంద్ తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికులు వారిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుండెపోటుతో రైతు మృతి



రామ్మూర్తి (ఫైల్)

యాడికి: తోటలో గుండెపోటుతో రైతు మృతి చెందిన ఘటన చందన గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఈడిగ రామ్మూర్తి(57)కి భార్య నరసమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు నాగేష్ ఉన్నారు. తన కున్న నాలుగు ఎకరాల్లో పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరు కుమార్తెలకు ఇటీవల వివాహం చేశాడు. వారం క్రితం తోటలోని బోరునీరు అడుగంటిపోవడంతో నిమ్మచెట్లు ఎండుముఖం పట్టాయి. రెండు రోజుల క్రితం రూ.లక్ష ఖర్చు చేసి బోరు వేసినా నీరు లభించలేదు. ఈక్రమంలో నిమ్మకాయల మార్కెట్ ఉందని ఉదయం కుమారుడితో కలిసి తోటకు వెళ్లాడు. నిమ్మకాయలు తొలగిస్తుండగా ఒక్కసారిగా కిందపడ్డాడు. గమనించిన కుమారుడు నాగేష్, తమ్ముడి కుమారుడు జయరామ్ రామ్మూర్తిని బైక్‌పై గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి తీసుకొచ్చారు. అయితే అతడు అప్పటికే మృతి చెందినట్లు అప్పయ్య, శ్రీనివాసులు రెడ్డి ధ్రువీకరించారు.

మద్యం స్వాధీనం

తాడిపత్రిటౌన్: చుక్కలూరులోని ప్రధాన సర్కిల్ వద్ద శుక్రవారం ఆలూరు గ్రామానికి చెందిన పెద్ద అంకాల్‌రెడ్డి బైక్‌పై మద్యం తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందతుడి నుంచి 52 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గుండె వైద్య శిబిరం

యాడికి: స్థానిక వివేకానంద హైస్కూల్‌లో శుక్రవారం విశాలాక్షి ఖాదీ సిల్క్స్ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతపురం కిమ్స్ సవీరా ఆస్పత్రి వైద్యులు 150 మందికి బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. ఇందులో 16 మందిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం సవీరా ఆసుపత్రికి తరలించినట్లు విశాలక్షి ఖాదీ సంస్థ అధ్యక్షుడు నారాయణ స్వామి తెలిపారు.

రీసోర్స్‌పర్సన్లకు శిక్షణ

గుత్తి: పట్టణంలోని మెప్మా భవనంలో శుక్రవారం ఏపీ మాస్ ఆధ్వర్యంలో రీసోర్స్‌పర్సన్స్‌కు నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమం జరిగింది. జిల్లా వాష్ కో–ఆర్డినేటర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ పరిశుభ్రమైన నీరు, శుభ్రంగా ఉన్న మరుగుదొడ్ల వాడటం, హ్యాండ్ వాష్ అలవాటు చేసుకోవాలన్నారు. టీఎంఎస్ కిరణ్మయి, కర్నూలు జిల్లా కో–ఆర్డినేటర్ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం ఎడ్యుకేషన్: పండిత పరిషత్ అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను ప్రముఖ కవి, రచయిత ఏలూరు రంగన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక మొదటి రోడ్డులోని పాట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. పరిషత్ జిల్లా అధ్యక్షుడు హనుమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తులసిరెడ్డి, రాష్ట్ర సహాధ్యక్షుడు ఎర్రిస్వామి, సీపీఎం నాయకులు రామిరెడ్డి, పండిత పరిషత్ నాయకులు సంజీవకుమార్ పాల్గొన్నారు.

జేవీవీ పోస్టర్ల విడుదల

అనంతపురం కల్చరల్: జేవీవీ నగర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ గతేడాది నవంబరు 7 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకు రాష్ట్ర వ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథం కలిగించే కళాజాతా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఈనెల 21న గుంటూరులో 'ఆంధ్రప్రదేశ్‌లో శాస్త్రీయ అభివృద్ధి' అనే అంశంపై సదస్సు జరగనున్నట్లు తెలిపారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థినులు

శింగనమల: ఆధునిక సాంకేతిక పద్ధతులతో పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని బద్వేలు ఎస్‌బీవీఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పేర్కొన్నారు. శుక్రవారం వారు ఈస్ట్ నరసాపురంలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. గ్రామీణ పటం, కాలక్రమం, బార్‌గ్రాఫ్, ప్రాబ్లమ్ ట్రీ అనాలిసిస్, సీజనల్ క్యాలెండర్, మ్యాట్రిక్స్ ర్యాంకింగ్ తదితర వాటిని వివరించారు. రెడ్డిపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు చందన, రైతులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సోదనపల్లిలో శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు భాగస్వామ్య గ్రామీణ అంచనా, గ్రామ చిత్ర పటం, వెన్ చిత్రం, ధోరణి విశ్లేషణలపై రైతులకు వివరించారు. రెడ్డిపల్లి వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త విద్య, రైతులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



యాడికి మండలం చందన గ్రామంలో మెడికల్ రిపోర్టులు అందజేసిన వైద్యులు



బీకేఎస్ మండలం వడియంపేటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

యాడికి: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం లాంటిదని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి అప్పయ్య, వైద్య నిపుణులు శ్రీనివాస రెడ్డి, మీనాక్షి చందన, పచ్చారుమేకలపల్లెకు చెందిన 250 మందికి వైద్య పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే 31 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు కంటి వైద్యాధికారి మధుసూదన్‌రాజు పేర్కొన్నారు.

పామిడి: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యం మరింత పదిలమని ఈఓఆర్డీ బీవీ శశికళ, సర్పంచ్ కే సుశీలమ్మ అన్నారు. శుక్రవారం ఖాదర్‌పేట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యులు నితిన్‌కుమార్‌రెడ్డి, క్రిష్ణప్రసాద్ 508 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి మందులు అందించారు. శిబిరాన్ని డీపీఎంఓ డాక్టర్ రవికుమార్ పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి షెక్షావలి, వైఎస్సార్‌సీపీ నేత కే దామోదరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, క్రిష్టిపాడు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యులు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రావులుడికి గ్రామంలోని చెన్నమ్మ గుడి వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 533 మందికి వైద్యపరీక్షలు నిర్వహించడంతోపాటు మందులను పంపిణీ చేశారు.

యల్లనూరు: యల్లనూరు–2 సచివాలయంలో శుక్రవారం సర్పంచు పెద్ద ఓబులమ్మ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు లోకేష్, శివసాయి, శశికళ, చరణ్ 400 మంది రోగులకు పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు అందించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ విజయ్‌శేఖర్‌నాయుడు, సీహెచ్ఓ మధు, సూపర్‌వైజరు హాజీవలి, పంచాయతీ కార్యదర్శి గీతా, ఏఎన్ఎంలు శ్రీదేవి, ప్రమీల, ఎంఎల్ హెచ్‌పీలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: వడియంపేట సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ తోహరున్నీసా, వైద్యులు 453 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు పంపిణీ చేశారు. సీహెచ్ఓ మోహన్‌రావు, ఈఓఆర్డీ దామోదరమ్మ, డాక్టర్ నవ్యశ్రీ, పీహెచ్ఎన్ చెన్నమ్మ, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని చైతన్యపరిచిన అభ్యుదయవాది వేమన



గుంతకల్లులో వేమన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘం నేతలు



గుత్తిలో వేమన జయంతిని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ సభ్యులు

గుంతకల్లుటౌన్: తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పరచిన అభ్యుదయవాది యోగివేమన అని సింగిల్‌విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి తెలిపారు. శుక్రవారం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యోగివేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్దనున్న వేమన విగ్రహానికి పూలు వేసి పూజలు చేశారు. పండితులకే కాదు పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పి వారిని మెప్పించిన గొప్పకవి వేమనని వారు కొనియాడారు. వేమన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. రెడ్డి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అశ్వర్థరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి జగదీశ్వర్‌రెడ్డి, వీరశైవలింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ యుగంధర్‌రెడ్డి, శ్రీకోదండరామాలయ కమిటీ చైర్మన్ శరణ బసిరెడ్డి. మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేమన జయంతి వేడుకలు

గుత్తి: పట్టణంలోని రాయలసీమ విమోచన సమితి కార్యాలయంలో శుక్రవారం వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాయలసీమ విమోచన సమితి, వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ సభ్యుల ఆధ్వర్యంలో వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి వేమన గొప్పతనాన్ని వివరించారు. ఐటీ వింగ్, ఆర్‌వీఎస్ సభ్యులు సిద్దారెడ్డి, జ్ఞానేశ్వరరెడ్డి, హరినాథ్‌రెడ్డి, రాజశేఖర్, రవి తేజ, సునీల్, శేషు, హర్ష , సూర్య తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు: స్థానిక శ్రీ భారతి సాహితీ సమితి కార్యాలయంలో కవి వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సమితి సభ్యులు వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్వాన్ గంగమ్మ వేమన గొప్పతనాన్ని వివరించారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు శివదయాళ్, గంగరాజు, నాయకులు పరంధామయ్య, జీసీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు హర్షణీయం



గుత్తిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు



పామిడిలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ సునితబాయి

గుత్తి: విజయవాడలో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు హర్షణీయమని వైఎస్సార్ సీపీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విభాగాల నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి జీఎం బాషా, పట్టణ కన్వీనర్ పీరా, కౌన్సిలర్ల సంఘం నాయకులు వరదరాజులు, బీసీ సెల్ జిల్లా నాయకులు కెఎం రంగనాయకులు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి భీమలింగ, ఎస్టీ సెల్ జిల్లా నేత లాలూనాయక్ మాట్లాడారు. విజయవాడ నడిబొడ్డున స్వరాజ్ మైదానంలో 18.81 ఎకరాల విస్తీరణంలో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చరిత్రాత్మకమన్నారు. కౌన్సిలర్లు కేవీ రమణ, నరేష్, మైనార్టీ జిల్లా నాయకులు వెల్డింగ్ రవూఫ్, సీనియర్ నాయకులు రామిరెడ్డి, సునీల్, హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర, అబ్దుల్, గిరి, శ్రీనివాసులు, రామచంద్ర, షేక్షావలి, మహ్మద్ బాషా అలియాస్ చెన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

పామిడి: తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి తహసీల్దార్ ఆర్‌వీ సునితబాయి ఆధ్వర్యంలో ఘన నివాళుర్పించారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాష్కరణను పురస్కరించుకుని కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం గొప్పవిషయమన్నారు. డీటీ జీ లక్ష్మినారాయణరెడ్డి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కొటేషన్ల ఆహ్వానం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్ల నుంచి కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ దేవదాసు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 18 నుంచి 26 వరకూ జరిగే రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో సున్నపు పూత, డెకరేషన్, పైపు షామియానాలు, లైవ్ ఎల్‌ఈడీ టీవీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న కాంట్రాక్టర్లు ఈ నెల 25 లోపు కొటేషన్లు సమర్పించాలని తెలిపారు. వివరాలకు ఆలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 లోపు సంప్రదించాలని సూచించారు.